నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శుక్రవారం 22 నవంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

## హైకోర్టు అనుమతితో 25న మహాధర్నా




మహబూబాబాద్ రూరల్, నవంబర్ 21 : హైకోర్టు అనుమతితో ఈ నెల 25న (సోమవారం) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన రైతుల మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే రైతుల మహాధర్నాకు ఎస్పీ అనుమతి ఇవ్వకుండా ఒత్తిడి చేశారని ఆరోపించారు. మానుకోటలో కేటీఆర్ వచ్చి గిరిజన రైతుల పక్షాన పోరాటం చేస్తే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు జరుగుతాయని రేవంత్‌కు భయం పట్టుకుందని పేర్కొన్నారు. 25న భారీగా రైతులను సమీకరించి కేటీఆర్‌తో జిల్లా కేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## జంగాలపల్లిని సందర్శించిన నిమ్స్ వైద్య బృందం

### నాటు వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచన


జంగాలపల్లిలో స్థానిక వైద్యులతో నిమ్స్ వైద్య బృందం

ములుగురూరల్, నవంబర్ 21 : ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామాన్ని గురువారం నిమ్స్ వైద్య బృందం సందర్శించింది. మూడు రోజులుగా గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరును, రక్త పరీక్షల రికార్డులను డాక్టర్లు గంగాధర్, స్వర్ణలత, సిరాజ్, విష్ణు, హరికృష్ణ, అనిరుధ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ నాటు వైద్యులను సంప్రదించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. అవసరానికి మించి పెయిన్ కిల్లర్స్ వాడొద్దని, అనారోగ్యంగా ఉంటే ప్రభుత్వ దవాఖానలోని వైద్యులతో చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం ములుగులోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. వార్డులు, టీ హబ్, రేడియాలజీ హబ్‌ను తనిఖీ చేశారు. వారి వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు, వైద్యులు శ్రీకాంత్, పవన్‌కుమార్, ప్రసాద్, మాస్ మీడియా అధికారి సంపత్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.


మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో పోలీసులతో కలిసి కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


ప్రధాన కూడలిలో పహారా కాస్తున్న పోలీసులు

# మానుకోట నిర్బంధం

**ఖాకీల వలయంలో జిల్లాకేంద్రం**

*అన్ని కూడళ్లలో మోహరించిన ఖాకీలు*
*అర్ధరాత్రి నుంచే 144 సెక్షన్ అమలు*

మహబూబాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ)/ మహబూబాబాద్ రూరల్ : మానుకోటను పోలీసులు నిర్బంధించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించాల్సి ఉండగా పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎస్పీ అనుమతి ఇవ్వకపోయినా రైతులే స్వచ్ఛందంగా ధర్నాలో పాల్గొని శాంతియుతంగా చేస్తారని పిలుపుతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించింది. జిల్లా కేంద్రానికి ఇతర మండలాల నుంచి రాకుండా భారీకేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలో అడుగడుగునా పోలీసుల కవాతుతో జనం బెంబేలెత్తిపోయారు. అసలు జిల్లాలో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు కంగారు పడ్డారు. స్వయంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పోలీసు బలగాల కవాతులో పాల్గొన్నారు. గురువారం మానుకోట పట్టణంలో నిర్వహించే గిరిజన రైతు మహాధర్నాకు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కావాల్సి ఉంది. చివరి నిమిషంలో పోలీసులు ధర్నాకు అనుమతి నిరాకరించడమే గాక గురువారం జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. దీంతో అర్ధరాత్రి నుంచే మహబూబాబాద్ పట్టణమంతా పోలీసులు నిర్బంధంలోకి వెళ్లిపోయింది. నలుగురికి మించి గుమికూడవద్దని అలాగే మండలాల నుంచి జిల్లాకేంద్రానికి వచ్చే దారుల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇద్దరు ముగ్గురికి మించి ఎక్కువ సంఖ్యలో జిల్లా కేంద్రానికి వస్తే వారి వివరాలు అడిగి తెలుసుకుని పట్టణం లోపలికి అనుమతించారు.

తహసీల్దార్ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్, వైఎస్సార్ సెంటర్, నర్సంపేట రోడ్డు, స్వామి వివేకానంద సెంటర్లలో పోలీసు కవాతు నిర్వహించారు. అయితే పట్టణంలోని ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున ఖాకీలు మోహరించడంతో ప్రజలు భీతిల్లిపోయారు. ప్రజలు తప్పనిసరి పని అయితేనే బయటకు రావాలని, రోడ్ల మీద ఎక్కువ సేపు ఉండొద్దని ఆటోలో మైకు ద్వారా పోలీసులు హెచ్చరికలు చేశారు. దీంతో బయటికెళ్దాం అనుకున్న ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు.


మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్

# లగచర్ల నుంచే రేవంత్ పతనం

- ధర్నాను అడ్డుకోవడం అవివేకం
- ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ ధ్వజం

మహబూబాబాద్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ) : గిరిజన రైతుల ధర్నాకు తాము అనుమతి కోరితే పోలీసులు హైడ్రామా చేశారని, ఎస్పీపై ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తెచ్చి అనుమతి నిరాకరించినట్లు స్పష్టమవుతోందని ధర్నాను అడ్డుకోవడం అవివేకమని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. లగచర్ల నుంచి రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్‌తో కలిసి మహబూబాబాద్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానుకోటలో 144 సెక్షన్ పెట్టి కర్ఫ్యూను తలపించే విధంగా చేశారన్నారు. జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పేరుతో ధర్నా కార్యక్రమానికి అనుమతి నిరాకరించారని తెలిపారు. అలాగే కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని, రాళ్లతో దాడి చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎస్పీ వెంటనే సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మారినేని వెంకన్న, యాకుబ్‌రెడ్డి, ఫరీద్, జేరిపోతుల వెంకన్న, భారత రవికుమార్, మంగళంపల్లి కన్న, ఎట్లా వేణు, పరకాల శ్రీనివాస్‌రెడ్డి, యాలమురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మానుకోట అంటే ఏమిటో చూపిస్తాం

*- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు*

గిరిజన రైతు ధర్నా నిర్వహిస్తామంటే అనుమతి నిరాకరించిన పోలీసులు అరాచకం సృష్టిస్తున్నారు. మేము పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడుతుంటే పోలీసులు మైకులు పెట్టి డిస్టర్బ్ చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి 144 సెక్షన్‌లో అమల్లోకి తెచ్చి ఆగమేఘాల మీద ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత అప్రజాస్వామికంగా చేస్తే ఎలా? మేము జిల్లాలో చిన్నగా ధర్నా చేసి వదిలేద్దామని అనుకున్నాం. ఇక మానుకోట అంటే ఏమిటో చూపిస్తాం. త్వరలోనే మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి రేవంత్‌ను గద్దె దింపడం ఖాయం. రేవంత్‌రెడ్డి నిత్యం సభల్లో కేసీఆర్ తల్చుకోకుండా ఉండలేకపోతున్నాడు అంటే రేవంత్‌కు కేసీఆర్ భయం ఎంతగా పట్టుకుందో అర్థమైంది. కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రజాప్రతినిధులు మా మీద రాళ్లు వేస్తామని అంటున్నారు. మేమే సీమాంధ్ర నాయకుల మీద రాళ్లు వేసి తన్ని తరిమేసిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మా శక్తి సామర్థ్యాలు ఏమిటనేది మా కంటే ఎక్కువ మీకే తెలుసు. మానుకోట గడ్డమీద సెగ పుట్టింది. నువ్వు అధికారం కోల్పోయే రోజు దగ్గరలోనే ఉందని గుర్తుపెట్టుకో రేవంత్‌రెడ్డి.

### అందరూ సంఘీభావం ప్రకటించాలి

లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడిని ఖండిస్తూ జిల్లాకు చెందిన గిరిజన సంఘాలు, ప్రజలు, పార్టీలకతీతంగా గిరిజన నాయకులు సహకరించాలి. గిరిజన మహాధర్నాకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలి. రాజ్యాంగంలో ధర్నా చేసే హక్కు ప్రతిపక్ష పార్టీలకు లేదా. త్వరలో జరగబోయే గిరిజన ధర్నాకు గిరిజన ప్రజాప్రతినిధులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించి విజయవంతం చేయాలి.
– మాలోత్ కవిత, పార్టీ జిల్లా అధ్యక్షురాలు

### మానుకోటకు మీరేం చేశారు?

పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డివిజన్ కేంద్రంగా ఉన్న మానుకోటను జిల్లాగా చేశాం. సమీకృత కలెక్టరేట్, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు నిర్మించాం. ప్రభుత్వ దవాఖానలను బాగుచేశాం. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. మీరు అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా జిల్లాకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలి. గిరిజన రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోం.
– డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే

### కళ్లు లేని కబోధులు కాంగ్రెసోళ్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు మానుకోట అభివృద్ధికి తగ్గడం మట్టి పోయలేదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజలు త్వరలోనే మిమ్మల్ని తన్ని తరిమేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఉద్యమ సమయంలో ఆంధ్రా వాళ్లను తరిమికొట్టినట్లు, త్వరలోనే కాంగ్రెస్ వాళ్లను తరిమికొట్టే రోజులు వస్తాయి.
– బానోత్ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే

## మరో రెండు ప్లాట్ ఫారాలు..


- కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- రెండు, మూడు నెలల్లో ప్రారంభంకానున్న పనులు
- ప్రయాణికులకు తప్పనున్న వెయిటింగ్ తిప్పలు




కాజీపేట, నవంబర్ 21 : కాజీపేట రైల్వే స్టేషన్‌లో మరో రెండు ప్లాట్ ఫారాలు ఏర్పాటు కానున్నాయి. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో రెండో అతి పెద్ద స్టేషన్‌గా పేరున్న కాజీపేటలో ప్రయాణికుల సౌకర్యార్థం వీటిని నిర్మించేందుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉత్తర, దక్షిణ భారతానికి ముఖ ద్వారంగా ఉన్న కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం వందకు పైగా ప్రయాణికుల రైళ్లు వివిధ ప్రాంతాల నుంచి బల్లార్ష, విజయవాడ, సికింద్రాబాద్ వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. 1904కు పూర్వం నిజాం ప్రభుత్వ హయాంలో అప్పటి వారి అవసరాలు, ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ప్లాట్ ఫారాలు, కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ ఏర్పాటైన తరువాత కాజీపేట నుంచి రాకపోకలు సాగించే రైళ్లు, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మూడు ప్లాట్ ఫారాలను రైల్వేశాఖ ఏర్పాటు చేయగా, వాటి గుండానే రాకపోకలు సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ స్టేషన్ మీదుగా రద్దీ ఎక్కువగా ఉండడం, ప్లాట్ ఫారాలు ఖాళీగా లేకపోవడంతో అధికారులు ఔటర్‌లోనే పలు రైళ్లను ఎక్కువ సమయం నిలుపుతుంటారు. ఈ క్రమంలో మరో రెండు ప్లాట్ ఫారాలు నిర్మించాల్సిన అవసరాన్ని ఇక్కడి అధికారులు తనిఖీల కోసం వచ్చిన ఉన్నతాధికారులకు వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కాజీపేట అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసి అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ పథకం రెండో దశ పనుల్లో భాగంగా స్టేషన్‌లో మరో రెండు ప్లాట్ ఫారాలు నిర్మించనున్నామని, రెండు, మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు.

## ఖుర్షీద్ హోటల్ బిర్యానీలో బొద్దింక

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నగరవాసుల డిమాండ్


బిర్యానీలో వచ్చిన బొద్దింక

గిర్మాజీపేట, నవంబర్ 21 : వరంగల్ మండిబజార్‌లోని ఖుర్షీద్ హోటల్ బిర్యానీలో బొద్దింక వచ్చిన ఘటన గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలిలా ఉన్నాయి.. బుధవారం రాత్రి నలుగురు మిత్రులు కలిసి ఖుర్షీద్ హోటల్‌కు వెళ్లి 4 సింగిల్ బిర్యానీలకు ఆర్డరిచ్చి రూ. 640 బిల్లు చెల్లించారు. అనంతరం బిర్యానీ తీసుకురాగా, ఒక ప్లేట్‌లోని బిర్యానీలో బొద్దింక రావడంతో వారంతా ఆశ్చర్యపోయారు. నిర్వాహకులను పిలిచి చూపిస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటల్ నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేసి నాణ్యమైన ఆహారపదార్థాలు వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరారు.

# చదివింది డిగ్రీ.. చేసేది వైద్యం

*బోగస్ సర్టిఫికెట్లతో క్లినిక్‌ల నిర్వహణ*

- తెలంగాణ వైద్య మండలి స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి..
- వరుస తనిఖీలతో నకిలీ వైద్యులకు దడ
- ఆయుష్ కౌన్సిల్, వైద్యాధికారులకు ఫిర్యాదు చేస్తామన్న వైద్య మండలి


హనుమకొండలో ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న తెలంగాణ వైద్య మండలి బృందం

వరంగల్, నవంబర్ 21 : వరంగల్ నగరంలో తెలంగాణ వైద్య మండలి అధికారులు వరుస తనిఖీలతో నకిలీ డాక్టర్లకు దడ పుట్టిస్తున్నారు. ఎలాంటి అర్హతలు లేకున్నా వైద్యులుగా చెలామణి అవుతూ రోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. డిగ్రీలు చదివి.. వైద్యం చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గురువారం ప్రపంచ పైల్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో సభ్యుల స్టింగ్ ఆపరేషన్‌లో నకిలీ డాక్టర్ల బాగోతాలు బయటపడ్డాయి. హనుమకొండ హనుమాన్ గుడి వద్ద ఉన్న మారుతి క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ రాకేశ్ బిశ్వాస్ వద్దకు డాక్టర్ నరేశ్‌కుమార్ తన కారు డ్రైవర్‌ను మలం నుంచి రక్తం వస్తుందని పంపించారు.

పరీక్షించిన రాకేశ్ బిశ్వాస్ పైల్స్ సమస్య ఉందని, దశలవారీగా తగ్గుతుందని, రూ. 20 వేలు ఖర్చవుతుందని తెలిపారు. పక్కనే ఉన్న డాక్టర్ నరేశ్ కుమార్, యాంటీ క్వాకరీ బృందం సభ్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ కూరపాటి రమేశ్ అక్కడికి వెళ్లి సదరు నకిలీ వైద్యుడిని పట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన సదరు వైద్యుడు చికిత్స చేసేందుకు ఖమ్మం నుంచి మరో డాక్టర్ వస్తాడని చెప్పాడు. ఖమ్మం నుంచి వచ్చే డాక్టర్‌ను కూడా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదివిన వ్యక్తిగా గుర్తించారు. అక్కడే ఉన్న అనుపమ క్లినిక్‌ను తనిఖీ చేయగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా ఏకే సర్కార్ నాచురోపతి, యునాని చదివి ఆయుర్వేద వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. కుమార్‌పల్లిలో నకిలీ ఆయుర్వేద వైద్యుడు బిశ్వాస్ కోల్‌కతాలో ఆయుర్వేద డిగ్రీ చదివినట్లుగా సర్టిఫికెట్ చూపించారు. తెలంగాణ ఆయుష్ కౌన్సిల్, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీలో అనుమతులు లేకుండా సొంతంగా, అశాస్త్రీయ పద్ధతుల్లో తయారు చేసిన లేపనాలను రోగులకు అందిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద చికిత్స పొందిన వారిలో ప్రముఖ వైద్యులున్నట్లు బృందం సభ్యులు గుర్తించి నివ్వెరపోయారు. ముగ్గురు నకిలీ డాక్టర్లపై జిల్లా వైద్యాధికారులు, ఆయుష్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మారుతి క్లినిక్ నిర్వాహకుడు రాకేశ్‌బిశ్వాస్, శ్రీలక్ష్మి క్లినిక్ నిర్వాహకుడు బిశ్వాస్‌పై ఎన్‌ఎంసీ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేస్తామని యాంటీ క్వాకరీ కమిటీ సభ్యుడు డాక్టర్ శిరీష్ తెలిపారు. కరీమాబాద్‌లో మరో బృందం తనిఖీల్లో అశ్విని క్లినిక్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడాన్ని గుర్తించి నిర్వాహకుడు డాక్టర్ దిలీప్‌కుమార్‌కు నోటీసులు ఇచ్చారు. జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు డాక్టర్ శేషుమాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గోడలపై రాతలు, కరపత్రాల ద్వారా ప్రచారాలు నమ్మి మోసపోవద్దన్నారు.


డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న సుందర్‌రాజ్ యాదవ్

## బీసీ రిజర్వేషన్ పెంచాల్సిందే

- డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు పలు బీసీ సంఘాల వినతి
- కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపట్టిన చైర్మన్ వెంకటేశ్వర్‌రావు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 105 అభ్యర్థనలు, విజ్ఞప్తుల స్వీకరణ

హనుమకొండ, నవంబర్ 21: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ పెంచాలని డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు బీసీ కుల సంఘాలు విన్నవించాయి. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలతో కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు బహిరంగ విచారణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 105 మంది తమ అభ్యర్థనలు అందించినట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ కమిషన్ రెకమండ్ మాత్రమే చేస్తుందని, తుది నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ సెక్రటరీ సైదులు, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా డీడీ జీ రాంరెడ్డి, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల బీసీ సంక్షేమ అధికారులు పుష్పలత, నరసింహస్వామి, రవీందర్ రెడ్డి, శైలజ, రవీందర్ పాల్గొన్నారు.

**వినతి పత్రాలు అందజేసిన నాయకులు**

పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో 50 శాతం బీసీ సభ్యులను నియమించాలని, అంతే మొత్తంలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ పొలిటికల్ జాక్ జేఏసీ నేత సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. స్థానిక సంస్థల్లో 42 శాతానికి రిజర్వేషన్లు పెంచడానికి ఉన్న మార్గాలను నివేదిక రూపంలో బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు చైర్మన్‌కు అందజేశారు. గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రెడ్డి గాండ్ల కులస్తులకు బీసీ–బీ సర్టిఫికెట్ ఇవ్వొద్దని అఖిల గాండ్ల తేలికుల రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు బొల్లేపల్లి అన్నపూర్ణ, కోటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి శివ వినతిపత్రం అందజేశారు. మేదరలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని మన్న భిక్షపతి, చిలువేరు సురేందర్, కోరుట్ల రమేశ్, ప్రతాపగిరి వెంకట రమణమూర్తి విన్నవించారు. మైనార్టీలకు వర్తించే పథకాలు తమకు అందేలా చూడాలని దూదేకుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. బీసీ–డీలో ఎక్కువ కులాలున్నాయని, ఏబీసీడీలుగా వర్గీకరించాలని బీసీ రాజ్యాధికార సమితి నాయకుడు వీరగోని తిరుపతి కోరారు. చేతివృత్తిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు.


మహిళా కానిస్టేబుల్‌కు మెమెంటో ఇస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య


మామునూరు పీటీసీలో కవాతు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

# ఆల్ ది బెస్ట్

**శిక్షణ పూర్తిచేసుకున్న 1,373 మంది కానిస్టేబుళ్లు**

- మామునూరు పీటీసీలో 1,127 మంది మహిళలు
- మడికొండ సీటీసీలో 246 మంది పురుషులు
- రెండు కళాశాలల్లో పాసింగ్ అవుట్ పరేడ్

సుబేదారి/కరీమాబాద్/హసన్‌పర్తి, నవంబర్ 21 : ఎంతో కష్టపడి పోలీసు కానిస్టేబుల్ కొలువు సాధించిన యువతీ యువకులు తమ శిక్షణను పూర్తిచేసుకున్నారు. మామునూరు పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ)లో 1,127 మంది మహిళలు, మడికొండ సిటీ పోలీసు శిక్షణ కళాశాల (సీపీటీసీ)లో 246 మంది పురుషులు, మొత్తం 1,373 మంది తొమ్మిది నెలల పాటు ట్రైనింగ్ పొందారు. 2022లో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు 2023లో పోటీ పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు వారి సొంత జిల్లాల్లో త్వరలోనే విధుల్లో చేరనున్నారు. ఈ మేరకు గురువారం మామునూరు పీటీసీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ (దీక్షాంత్) పరేడ్‌కు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మడికొండ సీపీటీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు కొత్త కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి మెమెంటోలు అందజేశారు. పాసింగ్ అవుట్ పరేడ్‌కు కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు తరలివచ్చి తమ వారిని పోలీసు దుస్తుల్లో చూసి మురిసిపోయారు.

**ఉత్తమ ప్రతిభ కనబర్చాలి : మంత్రి సీతక్క**

ఓరుగల్లును ఏలిన రాణి రుద్రమదేవి స్ఫూర్తితో ముందుకు సాగాలని కొత్త మహిళా కానిస్టేబుళ్లకు మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ రాణించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

**కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి : సీపీ**

కానిస్టేబుళ్లు శాంతి భద్రతల పరిరక్షణ కోసం సమర్థవంతంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. శిక్షణ సమయంలో అలవర్చుకున్న క్రమశిక్షణను రాబోయే రోజుల్లో కూడా అనుసరించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇంజారపు పూజ, రవి, అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఏసీపీలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్పర్జన్‌రాజ్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, మంగీలాల్, కిషన్ పాల్గొన్నారు.

### 19 ఏళ్లు హోంగార్డుగా చేశా



నేను 7వ తరగతి వరకు చదివి 2005లో హోంగార్డుగా చేరా. ఆ తర్వాత ఓపెన్‌లో టెన్త్, ఇంటర్ పూర్తి చేశాను. 2007 నుంచి కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. 8వ సారి సక్సెస్ అయ్యాను. నాకు ఇద్దరు పిల్లలు. నా భార్య, మేనమామ ప్రోత్సాహంతో 2023లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను.
– ఈ మొగులయ్య, కొండగట్టుపల్లి, మహబూబ్‌నగర్


శిక్షణ పొందిన కానిస్టేబుళ్లతో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా